క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు



జడ్జి రఘురాంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

హుస్నాబాద్: హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా జడ్జి రఘురాంను న్యాయవాదులు కలిశారు. అలాగే అడిషనల్ జడ్జి రవి కిరణ్, సబ్ జడ్జి మిలింద్ కాంబ్లెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు హన్మయ్య, దేవేందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో గజ్వేల్ మోడల్ స్కూల్ (జూనియర్ శాఖల) విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ గోపి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న శ్రీవాణి, సరిత, రాసజ్ఞ గత నెల డిసెంబర్ 30 నుంచి జనవరి 1 వరకు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్, ఫాస్ట్(5) నెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. బాలికల విభాగంలో జరిగిన పోటీల్లో తమ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటడంపై హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా క్రీడాకారులను పీడీ దేవరాజ్, అధ్యాపక బృందం అభినందించారు.

పీడితులకు న్యాయం చేయాలి

కొండపాక(గజ్వేల్): దళితులకు రాజ్యాంగం ద్వారానే విద్య హక్కుగా మారిందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో గల వినాయక కళాశాలలో న్యాయశాస్త్ర విద్యలో ఉత్తీర్ణత సాధించి బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న సతీశ్‌కుమార్‌ను డీబీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. దళిత పీడిత ప్రజలకు న్యాయం జరిగేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పరందాములు, అనిల్, శ్యాం, నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'పథకాలను సద్వినియోగం చేసుకోండి'

మిరుదొడ్డి(దుబ్బాక): అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీఓ రాజిరెడ్డితో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బక్కి భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి, పంచాయతీ కార్యదర్శి అశోక్, నాయకులు బాలాగౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డిపో మేనేజర్‌ను కలిసిన గ్రామస్తులు

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు అందిస్తున్న టికెట్లపై తమ ఊరు పేరు వచ్చేలా చూడాలని మండలంలోని మక్తమాసాన్‌పల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. ఈసందర్భంగా మంగళవారం జీపీపీ ఆర్టీసీ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. బస్సు టికెట్ తీసుకుంటే తమ గ్రామం పేరు కాకుండా సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బంగ్లా వెంకటాపూర్ పేరు వస్తుందని తెలిపారు.

ఉపాధ్యాయులు.. దేశ భవిష్యత్ నిర్మాతలు



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశ భవిష్యత్ నిర్మాతలు ఉపాధ్యాయులని ప్రముఖ విద్యావేత్త సత్యం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీవాణి పాఠశాలలో నిర్వహించిన స్వయం స్వపరిపాలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేలా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ

సిద్దిపేటరూరల్/అక్కన్నపేట(హుస్నాబాద్)/నంగునూరు/ములుగు(గజ్వేల్)/జగదేవ్‌పూర్/కొండపాక/హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్/దుబ్బాకరూరల్/తొగుట(దుబ్బాక)/మర్కూక్(గజ్వేల్)/చిన్నకోడూరు(సిద్దిపేట)/సిద్దిపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోంది. రెండు రోజుల విరామం అనంతరం మంగళవారం ప్రజలు దరఖాస్తులతో బారులు తీరారు.



నంగునూరు: సిద్దన్నపేటలో దరఖాస్తు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ రమేష్‌బాబు

- అక్కన్నపేట మండలంలోని దుబ్బతండా, గుడాటిపల్లి, కట్కూర్, చాపగానీతండా గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాలోతు లక్ష్మి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్ మండలాల పరిధిలోని తోర్నాల, రావురూకుల గ్రామాల్లో అధికారులు అర్జీలను స్వీకరించారు.
- నంగునూరు మండలంలోని బద్దిపడగ, సిద్దన్నపేట, అంక్షాపూర్, మైసంపల్లి గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. సిద్దిపేట ఆర్డీఓ రమేశ్‌బాబు ఆయా గ్రామాలను సందర్శించి దరఖాస్తు ప్రక్రియను పరిశీలించి సూచనలు చేశారు.
- ములుగు మండల కేంద్రమైన ములుగు, కొత్తూరు గ్రామాల్లో మంగళవారం అధికారులు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి రెండు బృందాలుగా ఆయా గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించారు. ములుగులో ప్రజాపాలన తీరును గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ పరిశీలించారు. కార్యక్రమంలో మండల పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, సర్పంచ్ మాధవి ఎంపీటీసీ హరిబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.
- జగదేవ్‌పూర్ మండలంలోని అంతాయిగూడ, బస్వాపూర్, ధర్మారం, పీర్లపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.
- కొండపాక మండలంలోని సిర్సనగండ్ల, తిమ్మారెడ్డిపల్లి, వెలికట్ట, కుకునూరుపల్లి మండలంలోని లకుడారం, మాత్‌పల్లి గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.
- హుస్నాబాద్ పట్టణంలో కొనసాగుతున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సరోజన పరిశీలించారు. హుస్నాబాద్ మండలంలోని కూచనపెల్లి, పందిల్ల, పొట్లపల్లి, బంజేరుపల్లి గ్రామాల్లో చేపట్టిన ప్రజాపాలనను సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మానస, ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.
- అక్బర్‌పేట– భూంపల్లి మండలం చిట్టాపూర్, చౌదర్‌పల్లి గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ ప్రజాపాలన కార్యక్రమ తీరును పరిశీలించారు.
- పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి అన్నారు. తొగుట మండలంలోని ఘనపూర్‌లో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి పాల్గొన్నారు.
- మర్కూక్ మండలంలోని పాములపర్తి, నర్సన్నపేట తదితర గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, ఎంపీపీ పాండుగౌడ్ సర్పంచ్‌లు మాధవిరాజిరెడ్డి, తిరుమల రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.
- చిన్నకోడూరు మండల పరిధిలోని గోనెపల్లి, చెలుకలపల్లి, ఓబులాపూర్ గ్రామాల్లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని జెడ్పీ సీఈఓ రమేష్ సందర్శించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.
- సిద్దిపేట అర్బన్ మండలంలోని తడ్కపల్లిలో అధికారులు ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. కాంగ్రెస్ అర్బన్ మండల అధ్యక్షుడు కొలిమి భిక్షపతి, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర నాయకుడు నాయిని నర్సింహారెడ్డి హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు.



అక్కన్నపేట: దుబ్బతండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



సిద్దిపేట రూరల్: రావురూకులలో..



ములుగు: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



చిన్నకోడూరులో పూజలు చేస్తున్న భక్తులు

అయోధ్య అక్షింతలకు పూజలు

చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు/బెజ్జంకి: అయోధ్య శ్రీరాముల వారి పూజిత అక్షింతలకు మంగళవారం చిన్నకోడూరులోని కన్యకాపరమేశ్వరి దేవాలయలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 15 వరకు ప్రతి ఇంటికి పూజిత అక్షింతల వితరణ చేస్తామని వీహెచ్‌పీ ప్రతినిధులు తెలిపారు. అలాగే నంగునూరులోని వేంకటేశ్వరాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాలమాకుల, దర్గపల్లి, ముండ్రాయి, ఖానాపూర్ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు డప్పు చప్పుళ్ల, మంగళహారతులతో ఆయా గ్రామాలకు తరలించారు. అనంతరం హన్‌మాన్ దేవాలయంలో అక్షింతలకు పూజలు చేశారు.



పాలమాకులలో భక్తుల శోభాయాత్ర

బెజ్జంకి మండలంలోని దాచారంలో అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు, ఎంపీటీసీ కొలిపాక రాజు, నితిన్, రాజు, వేణు, రాము, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన అధికారులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

సిద్దిపేటరూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగం అధికారులు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



చేర్యాల: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు

చేర్యాల(సిద్దిపేట)/నంగునూరు/బెజ్జంకి: బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజబాబు, నరేష్, హరికృష్ణ, శ్రీను, రవి, రహ్మాన్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నంగునూరులో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఎంఈఓ దేశిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జయపాల్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, రామిరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రకాంత్, వెంకటేశ్, నరేందర్, రాములు, లక్ష్మి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సర్పంచ్ మంజుల ఆవిష్కరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర చట్టం చేసి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం దూల్మిట్ట మండల కేంద్రంలో మండల కోకన్వీనర్ సుద్దాల భాస్కర్ అధ్యతన నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల మాదిరిగానే హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పోతిరెడ్డి రాజును నియమించారు.



ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న పాలకవర్గం

సన్మానం

దుబ్బాకటౌన్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మను దుబ్బాక మున్సిపల్ పాలకవర్గం మంగళవారం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గుప్త

ములుగు(గజ్వేల్): ప్రజాపాలనకు మంచి స్పందన వస్తుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త అన్నారు. ములుగులో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ అభయహస్తం ద్వారా ఆరు గ్యారంటీలను అందజేస్తామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొండల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కొండు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దౌల్తాబాద్(దుబ్బాక): మద్యం మత్తులో పురుగు మందు తాగి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని దొమ్మాట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నబుల్లి బుచ్చయ్య(45) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో గతేడాది డిసెంబర్ 25వ తేదీన ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఇంటి వెనకాల ఉన్న గొర్రెల కొట్టంలో మద్యం తాగి.. మత్తులో పురుగు మందు తాగాడు. భార్య సామవ్వ కూలి పనులకు వెళ్లి ఇంటికి వచ్చి చూడగా బుచ్చయ్య వద్ద పురుగు మందు వాసన వచ్చింది. వెంటనే పక్కింటి వారి సహాయంతో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మూడు రోజుల తర్వాత మళ్లీ ఆస్పత్రికి తీసుకురావాలని వైద్యులు కుటుంబ సభ్యులకు సూచించారు. తిరిగి డిసెంబర్ 30వ తేదీన ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం ఆర్‌వీఎం ఆస్పత్రికి పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 1వ తేదీన మృతిచెందాడు. మంగళవారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు కాగా ఇద్దరి వివాహం చేశాడు.

స్పాట్ అడ్మిషన్లు

ములుగు(గజ్వేల్): ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో 2023– 24 సంవత్సరానికి గానూ వర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలలలో బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ డిగ్రీలో ఖాళీగా ఉన్న సీట్లకు వాక్‌ఇన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ భగవాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హార్టిసెట్ 2023 క్వాలిఫై అయిన విద్యార్థులకు ఈనెల 4వ తేదీ నుంచి, బైపీసీ స్ట్రీమ్‌లో ఎంసెట్ 2023 క్వాలిఫై అయిన విద్యార్థులకు 5వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో యూఆర్/ఈడబ్ల్యూఎస్/నాన్ ఫార్మర్ కోటా కింద 4 సీట్లు, వనపర్తి జిల్లా మోజెర్ల ఉద్యాన కళాశాలలో యూఆర్/ఓసీ/నాన్ ఫార్మర్ కోటాలో 60 సీట్లు, యూఆర్/ఈడబ్ల్యూఎస్/నాన్ ఫార్మర్ కోటాలో 10 సీట్లు, మహబూబాబాద్‌లోని మల్యాల ఉద్యాన కళాశాలలో 28 సీట్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో అడ్మిషన్లు జరుగుతాయని భగవాన్ పేర్కొన్నారు.

వాహనదారుల బారులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు పెట్రోల్ బంకులకు వాహనదారులు పోటెత్తారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో లారీలు, ట్రక్కు డ్రైవర్లు సమ్మెలోకి దిగుతుండడంతో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందన్న ప్రచారంతో వాహనదారులు బారులు తీరారు. కొద్దిసేపటికి సమ్మె లేదని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.



గజ్వేల్‌లోని ఓ పెట్రోల్ బంకులో వాహనదారుల రద్దీ

సంక్షిప్త వార్తలు

◆ ఎమ్మెల్యేకు వినతి

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రద్దుతో అన్యాయం జరిగిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అమలు చేయాలని కోరుతూ ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాసూరి మల్లికార్జున్ హైదరాబాద్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే బెజ్జంకి మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

◆ విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

నంగునూరు(సిద్దిపేట): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందిన సంఘటన ఖానాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అక్కేనపల్లి కృష్ణారెడ్డి రోజూ మాదిరిగానే తన పాడి గేదెను వ్యవసాయ బావి వద్ద మేతకు వదిలాడు. ఈక్రమంలో విద్యుత్ స్తంభం నుంచి బావికి కనెక్షన్ ఉన్న వైర్లు తెగి పడడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

◆ పీహెచ్‌సీ నిర్మాణానికి భూదానం



మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని కొండాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు గత ప్రభుత్వంలో రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. పీహెచ్‌సీ నిర్మాణానికి అవసరమయ్యే భూమిని గ్రామానికి చెందిన చెప్యాల బాల్‌రెడ్డి జ్ఞాపకార్థం అతడి కుమారుడు చెప్యాల ప్రతాప్‌రెడ్డి భూమిని దానం చేశారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పీహెచ్‌సీ నిర్మాణ కోసం దాత వద్ద స్వీకరించిన స్థలాన్ని బీఆర్‌ఎస్ దూల్మిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరితో స్థానిక నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేఖా శ్రీనివాస్, ఉపసర్పంచ్ కనుకయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్, నాయకులు కనకచారి తదితరులు పాల్గొన్నారు.

◆ క్రికెట్ టోర్నీ ప్రారంభం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లిలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగరావు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరవేద మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రామకృష్ణారెడ్డి, సతీష్, సంతోష్, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

◆ పరామర్శ

సిద్దిపేటఅర్బన్: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మంగళవారం పరామర్శించారు. బక్రిచెప్యాల మాజీ సర్పంచ్ రవి తల్లి మృతిచెందగా వారి కుటుంబాన్ని, మిట్టపల్లి పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ తండ్రి మృతిచెందగా ఆయన కుటుంబాన్ని, లింగారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ రామస్వామి తల్లి మృతిచెందగా వారి కుటుంబాన్ని, తడ్కపల్లి మాజీ సర్పంచ్ బాలనర్సయ్య తల్లి మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు శ్యాంసుందర్‌రెడ్డి, అంబటి మంగ భాస్కర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వంగ ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

◆ సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సైబర్ నేరాలతో కలిగే నష్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని నర్సాపూర్‌లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లు, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

◆ బడిలో నూతన సంవత్సర వేడుకలు



చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉల్లెంగుల సేవా ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగుల ఏకానందం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.